క్లుప్తంగా

విద్యాసామగ్రి పంపిణీ



నిండ్ర: విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేస్తున్న సర్పంచ్

నిండ్ర: మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు ప్రభుత్వం అందించిన పాఠ్యపుస్తకాలతో పాటు బ్యాగులు పంపిణీ చేశారు. బుధవారం హెచ్ఎం శివయ్య, సర్పంచ్ బాబురెడ్డి చేతుల మీదుగా విద్యార్థులకు వాటిని అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న ఉపకరణాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా గంగమ్మ జాతర

విజయపురం : మండలంలోని బూచివానత్తం పంచాయతీ అంకమ్మ కాలనీలో బుధవారం గంగమ్మ జాతర వైభవంగా జరిగింది. కాలనీ చుట్టూ విద్యుత్ దీపాలతో అలంకరించారు. వీధి చివర అమ్మవారి ప్రతిమ కలిగిన విద్యుత్ కటౌట్ ఏర్పాటు చేశారు. వీధుల్లో వేపాకు తోరణాలు కట్టారు. ఉదయం భక్తులు అమ్మవారికి అంబలి పోసి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం అమ్మవారిని ఊరేగింపుగా తీసుకెళ్లారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు సైతం అమ్మవారిని దర్శించుకున్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు



గర్భిణులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ మౌనిక

గంగాధర నెల్లూరు: మండల పరిధిలోని తూగుండ్రం పీహెచ్‌సీ పరిధిలోని ప్రతి గర్భిణీ సకాలంలో వైద్య పరీక్షలు చేసుకుంటేనే మాతా శిశు మరణాలు జరగవని వైద్యాధికారి మౌనిక తెలిపారు. బుధవారం తూగుండ్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు అన్నిరకాల వైద్యపరీక్షలు చేశారు. అనంతరం డాక్టర్ మాట్లాడుతూ గర్భిణులు పౌష్టికాహారంతో పాటు పండ్లరసం, ఆకుకూరలు ఎక్కువ నీరు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా గర్భిణులు ప్రతీ నెలా వైద్య పరీక్షలు తప్పక చేసుకోవాలన్నారు. అనంతరం గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కృష్ణమ్మ, పలువురు నర్సులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది, విద్యార్థులు

నాగలాపురం: డయేరియా, బాల్య వివాహాల నిర్మూలనపై నాగలాపురంలోని విజ్ఞానసుధా హైస్కూల్‌లో అంగన్‌వాడీ కేంద్రం ద్వారా వైద్యాధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డయేరియా నిర్మూలనకు పరిసరాలను పరిశుభ్రత పాటించాలని వైద్యాధికారి విజయ్‌కుమార్ అన్నారు. అనంతరం బాల్య వివాహాలు చేసుకోవడం చట్టరీత్యా నేరమని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో అంగన్‌వాడీ సిబ్బంది ప్లకార్డులతో నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ హేమకుమార్, అంగన్‌వాడీ టీచర్ విజయలక్ష్మి, సీహెచ్ఓ సుస్మిత, ఆశ, కోకిల, మునిలక్ష్మి, పాల్గొన్నారు.

చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

పుత్తూరు: పిల్లల తొలి అడుగులు అంగన్‌వాడీల వైపేనని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అన్నారు. బుధవారం స్థానిక ఏఎంసీ కల్యాణ మండపంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పిల్లల సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథి గా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ పిల్లల భవిష్యత్‌కు నాంది పడేది అంగన్‌వాడీ కేంద్రాల్లోనే అన్నా రు. అంగన్‌వాడీ వర్కర్ల సేవలు అభినందనీయమ ని ప్రశంసించారు. అనంతరం పిల్లల చేత అక్షరాభ్యాసం చేయించారు. కేంద్రాల్లో పోషణ వాటికలు నిర్వహించడానికి అవసరమైన కూరగాయల విత్తనాలను సెక్టార్ లీడర్ల ద్వారా 129 అంగన్‌వాడీ కేంద్రాలకు పంపిణి చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు డీఎస్ ఏలుమలై, జి.మాధవయ్య, మురళీధర్‌రెడ్డి, బాబునాయుడు, సీడీపీఓ పద్మజ, ఎంపీడీఓ ఇందిర, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు గీతాంజలి, సంధ్య, మనీలా, అనిత పాల్గొన్నారు.

సారా.. ఆపరా..!

విజయపురం దళితవాడ (మంగళం) అడవుల్లో సారా తయారీ కోసం సిద్ధం చేసిన సారా పొయ్యి



రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి సరిగా నెల అవుతోంది. అయితే ఈ తక్కువ కాలంలోనే సారా మహమ్మారి పడగ విప్పుతోంది. గత ప్రభుత్వం సారా నియంత్రణకు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(సెబ్) ఏర్పాటు చేసింది. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో సారా తయారీ పూర్తిగా కనుమరుగు అయింది. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక విజయపురం మండలంలోని తమిళనాడు సరిహద్దుల్లో ఉన్న గ్రామాల్లో సారా తయారీ విచ్చలవిడిగా మారింది. ఇటీవలే తమిళనాడులో సారా తాగి ఇటీవల చాలామంది చనిపోయారు. ఈ నేపథ్యంలో ఇక్కడ సారా మహమ్మారి విచ్చలవిడిగా దొరకడంపై స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- మంగళం అడవుల్లో సారా తయారీకి 50 ఊటలు, 25 పొయ్యిలు ఏర్పాటు
- వారానికి 25 వేల లీటర్ల సారా తయారీ,
- సరిహద్దులో ఉన్న తమిళనాడుకు తరలింపు
- మామూళ్ల మత్తులో ఎక్సైజ్‌శాఖ అధికారులు
- పాల సముద్రంలో విచ్చలవిడిగా సారా ప్యాకెట్లు విక్రయం
- తక్షణం సారా తయారీని నిర్మూలించాలంటున్న మహిళలు

సాక్షి, టాస్క్‌ఫోర్స్: సారా పేరు వింటే ఇప్పుడు తమిళనాడు గుండెల్లో తడ పుట్టిస్తుంది. సారా తాగి సుమారు 25 మంది తమిళనాడులో మృతి చెందిన విషయం తెలిసిందే. అంతేకాదు సారా తాగి చాలామంది అతిచిన్న వయసులో చనిపోవడంతో స్త్రీలు, వితంతువులు అవుతున్నారు. అలాంటి పరిస్థితి మన రాష్ట్రంలో రాకుండా ఉండాలంటే సారా తయారీపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. ప్రస్తుతం సారా తయారీపై రాష్ట్రప్రభుత్వ వైఫల్యమో, లేక సెబ్ అధికారుల నిర్లక్ష్యమో తెలియడం లేదు. విజయపురం దళితవాడ (మంగళం)లో సారా తయారీ మళ్లీ విజృంభిస్తోంది. విజయపురం మండలంలో సారా తయారీ విచ్చలవిడిగా సాగుతోంది. విజయపురం దళితవాడ (మంగళం) అడవిలో రాత్రి, పగలూ అనే తేడా లేకుండా సారా తయారీ చేస్తున్నారు. ఇప్పటికే 50 సారా ఊటలు, 25 పొయ్యిలు సిద్ధంగా ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. అంతేకాకుండా వారానికి 25 వేల లీటర్ల సారా తయారీ చేస్తున్నట్లు తెలిసింది. ఇక్కడ తయారీ చేసిన సారాను కొందరు స్థానికంగా ఇళ్లలో విక్రయిస్తుంటే మరికొంతమంది మండలంలోని పలు గ్రామాల్లో విక్రయిస్తున్నట్లు సమాచారం. ఇంకొంతమంది మండలానికి సరిహద్దు ప్రాంతమైన తమిళనాడుకు అధిక ధరకు సారా విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

తూతూమంత్రంగా తనిఖీలు..

స్థానిక గ్రామాల్లో సారా తయారీ, విక్రయాలపై స్థానిక ప్రజలు అధికారులకు సమాచారం ఇస్తున్నారు. కానీ కొందరు ఎక్సైజ్ సిబ్బంది విక్రయదారులకు పలానా వాళ్లు ఫిర్యాదు చేశారని సమాచారం ఇస్తుండడంపై ఫిర్యాదు చేయడానికి కూడా ఎవరూ ముందుకు రావడంలేదు. దీనికితోడు అందుకే నిజమైన తయారీ, విక్రయదారులు తప్పించుకుంటున్నారని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా దాడుల సమయంలో కొందరు అధికారులు మామూళ్లు తీసుకుని వదిలి పెడుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. తూతూమంత్రంగా దాడులు చేసి చేతులు దులుపుకుంటున్నారని, దీనిపై జిల్లా ఉన్నతస్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కళ్లెదుటే కనిపిస్తున్న తమిళనాడులో మరణాలు..

కల్తీ సారా తాగి సుమారు 35 మంది వరకు తమిళనాడులో ప్రాణాలు కోల్పోయిన సంఘటన మనకు ఇంకా కళ్లెదుటే కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో మన దగ్గర అలాంటి పరిస్థితి తలెత్తితే కుటుంబాలు నాశనమవుతాయని మహిళలు భయపడుతున్నారు. కల్తీ సారా తాగిన వారు ఉన్నఫళంగా చనిపోవడం తెలిసిన విషయమే. కుటుంబ పెద్ద చనిపోతే రోడ్డున పడతామనే భయం స్థానిక మహిళల్లో నెలకొంది. దీంతో ఇప్పటికైనా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని సారా తయారీని పూర్తిగా నిర్మూలించాలని కోరుతున్నారు.

పాలసముద్రంలో జోరుగా సారా విక్రయాలు



విచ్చలవిడిగా దొరుకుతున్న సారా ప్యాకెట్లు

పాలసముద్రం : మండలవ్యాప్తంగా సారా తయారీ, విక్రయాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయి. ఎక్సైజ్ శాఖ, స్థానిక పోలీసులు పట్టించుకోకపోవడంతో సారా విక్రేతలకు అడ్డు లేకుండా పోయిందని, దీంతో పబ్లిక్‌గానే సారా అమ్ముతున్నారని మహిళలు వాపోతున్నారు. గత ప్రభుత్వం సారాను పూర్తిగా అరికట్టిందని, కొత్త ప్రభుత్వం ఏర్పడి నెల రోజుల్లోనే గ్రామాల్లో సారా ఏరులై పారుతోందని ఆరోపించారు. కొంత మంది సారా విక్రేతలు నరసింహపురంలో సారాను ప్లాస్టిక్ ప్యాకెట్లలో నింపి మండల వ్యాప్తంగా సరఫరా చేస్తున్నారు. రాత్రివేళ ఇంటి నుంచి మహిళలు బయటకు రావడానికి తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. సారా తాగిన మత్తులో సింహరాజుపురంలో కొంతమంది మేకలు ఎత్తుకెళ్లిపోతున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. తమిళనాడు సరిహద్దులో ఉన్న తొట్టికండ్రిగలో కొంత మంది యువత గంజాయి సేవిస్తున్నారు. పోలీసులకు తెలిసినా పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఎక్సైజ్ శాఖ, స్థానిక పోలీసులు సారాను అరికట్టాలని కోరుతున్నారు.

గెలిచినా.. ఓడినా.. ప్రజల పక్షమే



పుత్తూరులో పౌష్టికాహారం అందుకున్న గర్భిణులు

నగరి/పుత్తూరు : గెలిచినా.. ఓడినా.. ప్రజల పక్షమే అని మాజీ మంత్రి ఆర్కేరోజా నిరూపిస్తున్నారు. బుధవారం నగరి–పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రుల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు ×రోజా చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఉచితంగా పౌష్టికాహారం అందిస్తున్నారు.

గత ఐదేళ్లుగా ఈ పౌష్టికాహారం పంపిణీని మాజీ మంత్రి ఆర్కే రోజా గెలుపోటములకు అతీతంగా కొనసాగిస్తూనే ఉన్నారు. బుధవారం పలువురు గర్భిణులు, వారి వెంట వచ్చే చిన్నారులు పౌష్టికాహారం భుజించారు. కార్యక్రమంలో ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



నగరి: పౌష్టికాహారం తింటున్న గర్భిణులు

టీచర్లకు ముగిసిన టీచ్ టూల్



కార్యక్రమంలో మాట్లాడుతున్న కోర్సు డైరెక్టర్ శ్రీదేవి

నగరి : స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో నగరి, వెదురుకుప్పం, నిండ్ర, విజయపురం, కార్వేటినగరం, పాలసముద్రం మండలాలకు చెందిన ఉపాధ్యాయులకు తొమ్మిది రోజుల పాటు టీచ్ టూల్‌పై అందించిన శిక్షణా కార్యక్రమం బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో కోర్సు డైరెక్టర్ శ్రీదేవి మాట్లాడుతూ ఉపాధ్యాయుల బోధన మెరుగు పరచడానికి, విద్యార్థులకు అనుగుణంగా బోధించడానికి ఇప్పటి వరకు అందించిన శిక్షణ దోహదపడుతుందన్నారు. శిక్షణ పొందిన ఉపాధ్యాయులు తమ పాఠశాలలోని ఉపాధ్యాయుల బోధనను పరిశీలించి బోధనా పద్ధతుల అభివృద్ధికి సహకరించాలన్నారు. అప్పుడే శిక్షణకు ఫలితం ఉంటుందన్నారు.

కార్యక్రమంలో ఎంఈఓ నమశ్శివాయం, ప్రధానోపాధ్యాయులు పార్వతీదేవి, విషయ నిపుణులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

ఎంపీసీ, బైపీసీ గ్రూపులతో ఉజ్వల భవిష్యత్



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సుధ

పెనుమూరు(కార్వేటినగరం): ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీ గ్రూపులు తీసుకుంటే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని అపోలో అధ్యాపకురాలు డాక్టర్ పీ.సుధ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అపోలో యూనివర్సిటీ బీఎస్సీ హెల్త్ సైకాలజీ విద్యార్థినుల ఆధ్వర్యంలో కెరీర్ గైడ్‌లైన్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆమె మాట్లాడుతూ ఇంటర్మీడియెట్ ప్రతి విద్యార్థి జీవితంలో ఒక మలుపు లాంటిదన్నారు. ఇంటర్‌లో బైపీసీ, ఎంపీసీ విద్యనభ్యసించిన తరువాత విద్యార్థులు ఎలాంటి కోర్సులు తీసుకోవాలనే విషయాల గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ బాలసుబ్రమణ్యం రాజు, అపోలో యూనివర్సిటీ బోధన సిబ్బంది డాక్టర్ విజయ్, విద్యార్థులు పాల్గొన్నారు.

దేశమ్మ ఆలయ గుత్తహక్కుల వేలం రేపు

నగరి : మున్సిపల్ పరిధిలోని టీఆర్ కండ్రిగలో వెలసిన నేత్రప్రదాయణి దేశమ్మ దేవాలయ ఆదాయ వనరుల గుత్త హక్కుల వేలం ఈ నెల 12వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ రామచంద్రారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది సెప్టెంబరు 1 నుంచి 2025 ఆగస్టు 31వ తేదీ వరకు గుత్తహక్కులు కేటాయించే నిమిత్తం వేలం ఉంటుందన్నారు. తలనీలాలు పోగు చేసుకునే హక్కు, పార్కింగ్ హక్కులకు సీల్డు టెండరు ద్వారా, సజీవ కోళ్లకు, దుకాణ సముదాయాలు, కొబ్బరి చిప్పలు పోగు చేసుకునే హక్కులు బహిరంగ వేలం ద్వారా కేటాయిస్తామన్నారు. దేవదాయ శాఖ అధికారి పర్యవేక్షణలో వేలంపాట జరుగుతుందన్నారు. ఆసక్తి గలవారు వేలంపాటలో పాల్గొనవచ్చని వివరాలకు ఆలయం వద్ద గల ఈఓ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

జనాభా నియంత్రణ సమష్టి బాధ్యత

చిత్తూరు కలెక్టరేట్ : జనాభా నియంత్రణ సమష్టి బాధ్యతని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. ఆయన బుధవారం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన ప్రపంచ జనాభా దినోత్సవం పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ జనాభా నియంత్రణకు బాల్య వివాహాలను నిరోధించాలన్నారు. పెళ్లీడు వచ్చాకే వివాహాలు చేసేలా క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. సురక్షిత కుటుంబ నియంత్రణ పద్ధతులపై ప్రతి ఒక్కరికీ తెలియజేయాలని సూచించారు. జిల్లాలో గురువారం నిర్వహించే ప్రపంచ జనాభా దినోత్సవంలో అన్ని శాఖల అధికారులు సమన్వయం కావాలని తెలిపారు. కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్‌వో ప్రభావతి దేవి, అదనపు డీఎంఅండ్‌హెచ్‌వో వెంకటప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీస్వప్న వారాహిదేవి అలంకరణలో అమ్మవారు

రామచంద్రాపురం: మండలంలోని రాయలచెరువుకట్ట సమీపంలోని శ్రీశక్తి పీఠంలో జరుగుతున్న వారాహి నవరాత్రుల్లో భాగంగా ఆలయంలో కొలువైన శ్రీ శ్వేత వారాహిదేవి అమ్మవారు బుధవారం శ్రీస్వప్న వారాహిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ నేపథ్యంలో శ్రీశక్తిపీఠ వ్యవస్థాపకులు శ్రీ సిద్దేశ్వరానంద భారతీస్వామి, మాతాజీ శ్రీరమ్యానంద భారతి పీఠంలో కొలువైన వారాహీ అమ్మవారిని సుప్రభాతసేవతో మేల్కొలిపి నిత్య పూజలు ప్రారంభించారు. వేద పండితులు మంత్రాలతో హోమం జరిపించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు దర్శన భాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు.

ప్రయోగాలు పకడ్బందీగా చేయించాలి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా అటల్ టింకరింగ్ ల్యాబ్‌లలో ప్రయోగాలను పకడ్బందీగా చేయించాలని జిల్లా సైన్స్ ఆఫీసర్ వెంకటరమణ తెలిపారు. చిత్తూరులోని పీసీఆర్ ప్రభుత్వ పాఠశాలలో బుధవారం ఒక రోజు ఓరియెంటేషన్ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 30 పాఠశాలల్లో అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు అమలవుతున్నాయని పేర్కొన్నారు. సంబంధిత ల్యాబ్‌లలో సైన్స్ ఉపాధ్యాయులు క్రమం తప్పకుండా విద్యార్థులతో ప్రయోగాలు చేయించాలని తెలిపారు. ప్రయోగాల నిర్వహణపై చేపట్టాల్సిన నియమాలను తెలియజేశారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

విజయపురం : మండలంలో పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా జరుగుతున్నట్లు ఎంపీడీఓ బ్రహ్మయ్య తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి కోసం ఏర్పాటు చేసిన ట్యాంకులను క్లోరినేషన్ చేసి, మురుగు కాలువ వద్ద బ్లీచింగ్ చేస్తున్నామని తెలిపారు. అలాగే పిచ్చి మొక్కలను తొలగిస్తున్నామని చెప్పారు. తాగునీరు పరిశుభ్రంగా ఉంటే రోగాలకు దూరంగా ఉండవచ్చని ఆయన తెలిపారు. లీకేజ్ అయిన మంచి నీటి పైపులైన్లు సరి చేసినట్లు ఆయన చెప్పారు. రక్షిత మంచి నీటిని అందించేందుకు మండలంలో యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణ రూపొందించామన్నారు. గ్రామస్థాయిలో ఎక్కడైనా లీకేజీ ఉన్నట్లు తన దృష్టికి తీసుకొస్తే వెంటనే వాటిని సరిచేస్తామన్నారు. ప్రజలు కూడా తమ ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, అప్పుడే రోగాల బారిన పడకుండా మనం ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు.

పరిశుభ్రతతోనే రోగాలు దూరం



బోరు చుట్టూ వర్షపునీరు కలుషితం కాకుండా శుభ్రం చేయిస్తున్న అధికారులు

పాలసముద్రం : సీజనల్ వ్యాధులపై గ్రామీణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల విస్తరణాధికారి రమేష్, పంచాయతీ కార్యదర్శి రాజీవ్ కుమార్ తెలిపారు. బుధవారం శ్రీకావేరిరాజుపురం సచివాలయ ఆవరణలో ఆరోగ్య సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు, పారిశుద్ధ్య కార్మికులకు సర్పంచ్ గాలి మహేష్ బాబు ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ దోమకాటుతో సంక్రమించే డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా, తదితర వ్యాధులపై అవగాహన కల్పించారు. వర్షాకాలంలో తాగునీరు కలుషితమయ్యే అవకాశం ఉందన్నారు. ఈ నీటిని తాగడం వల్ల డయేరియా వ్యాధి బారిన పడే అవకాశం ఉందన్నారు. కలుషిత నీటిని తాగవద్దని, కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని సూచించారు. దోమ కాటుకు గురికాకుండా దోమతెరలు వాడాలని సూచించారు. అనంతరం గ్రామాలకు సరఫరా అయ్యే బోరు మోటారులో నీరు కలుషితం కాకుండా బోర్ల చుట్టూ శుభ్రం చేశారు.

ప్రతి సమస్యను పరిష్కరిస్తాం



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే

కార్వేటినగరం: ప్రజలు తమ దృష్టికి తీసుకొచ్చిన ప్రతి సమస్యను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే డాక్టర్ వీఎం థామస్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'మీ కోసం మీ ఎమ్మెల్యే, సమస్య మీది.. పరిష్కారం నాది' అనే కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు తమ దృష్టికి తీసుకొచ్చిన ప్రతి సమస్యకు పరిష్కారం చూపేందుకు ప్రభుత్వ అధికారులు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. తాను ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి సేవలు అందిస్తానన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి సమస్యను క్షుణ్ణంగా పరిశీలించి ఆయా శాఖల అధికారులకు అందించి పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు. అనంతరం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో నగరి ఆర్డీఓ వెంకటరెడ్డి, తహసీల్దార్ పుష్పకుమారి, ఎంపీడీఓ శ్రీధర్‌నాయుడు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నేడు సాయిబాబాకు పాలాభిషేకం



సాయిబాబా ఆలయం

పుత్తూరు: పట్టణంలోని శ్రీషిర్డీ సాయిబాబా ఆలయంలో ఏటా జూలై రెండవ గురువారం గురుపౌర్ణమిని పురస్కరించుకుని భక్తులచే స్వయంగా పాలాభిషేకం నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా వేకువజామున 2.30 గంటలకు సుప్రభాత సేవ, 3.30కు కాగడ హారతి నిర్వహిస్తారు. 4 గంటలకు మంగళ స్నానం, విష్ణుసహస్రనామం నిర్వహించనున్నారు. అనంతరం 4.30 నుంచి ఉదయం 9 గంటల వరకు భక్తులు స్వయంగా తమ స్వహస్తాలతో బాబా మూలవిరాట్‌కు పాలాభిషేకం చేయడానికి అనుమతిస్తారు. ఈ అవకాశం కోసం ఏడాది పాటు ఎదురు చూసే భక్తులు పుత్తూరు చుట్టుపక్కల గ్రామాల నుంచి వేలాదిగా తరలివస్తారు. ఇందుకోసం ఆలయం వద్ద ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేశారు. పాలాభిషేకం అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు మధ్యాహ్న హారతి, 12.30 గంటలకు మహా అన్నప్రసాద వితరణ నిర్వహిస్తారు. సాయంత్రం 6 గంటలకు సంధ్య హారతి, 8 గంటలకు పవళింపు హారతి నిర్వహిస్తారు. పాలాభిషేకం నిమిత్తం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

గజవాహనంపై పరాశరేశ్వరస్వామి



గజవాహనంపై పరాశరేశ్వరస్వామి

నారాయణవనం: టీటీడీ అనుబంధ చంపకవల్లీ సమేత పరాశరేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో బుధవారం సాయంత్రం స్వామి వారు గజవాహనాన్ని అధిరోహించి పురవీధుల్లో విహరించారు. ఉదయం ఆలయాన్ని తెరచిన అర్చకులు నిత్యపూజలు, పరివార దేవతలకు అభిషేకాలు చేసి, నైవేద్య సమర్పణ చేశారు. 10 గంటలకు చంపకవల్లీ, పరాశరేశ్వర్లకు స్నపన తిరుమంజనం నిర్వహించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించి భక్తులకు వితరణ చేశారు. సాయంత్రం శుద్ధి, తోమాల, నైవేద్యాలు అందుకున్న ఉత్సవర్లు వివిద సుగంధ పుష్ప మాలికలను, స్వర్ణాభరణాల అలంకరణలో గజ వాహనంపై నుంచి భక్తులను కటాక్షించారు. భక్తులు స్వామివారికి హారతులు పట్టారు. ఈ కార్యక్రమాలను స్థానిక ఆలయాల డిప్యూటీ ఈఓ దేవేందర్, ఏఈఓ పార్థసారథి, సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయ అధికారి నాగరాజు, అర్జితం అధికారి భరత్ పర్యవేక్షించారు. గురువారం సాయంత్రం రథోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఆలయానికి చెక్క రథం లేని కారణంగా సర్వభూపాల వాహనసేవను నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారి నాగరాజు తెలిపారు. సోమవారం సాయంత్రం 7 గంటలకు ఆలయంలో చంపకవల్లీ, పరాశరేశ్వరస్వామికి జరిగే ఆర్జిత కల్యాణోత్సవంలో రూ.500 చెల్లించి దంపతులు పాల్గొనాలని ఆయన కోరారు.

సిగరెట్లు విక్రయిస్తే జరిమానా

తిరుపతి క్రైమ్: నగరంలో బహిరంగ ప్రదేశాల్లో సిగరెట్లు, బీడీలు విక్రయించే వారికి పోలీసులు బుధవారం జరిమానా విధించారు. పాఠశాలలు, కళాశాలలు విద్యాసంస్థలకు 100 మీటర్ల పరిధిలో ఉన్న దుకాణాల్లో సిగరెట్లు, బీడీలు విక్రయించకూడదన్నారు. ధూమపానం ఆరోగ్యానికి హానికరం అనే హెచ్చరిక లేకుండా సిగరెట్, బీడీలు అమ్ముతున్న దుకాణాదారులకు నగరంలోని పలు పోలీస్‌స్టేషన్ పరిధిలో రూ.200 జరిమానా విధించారు.